కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు లాటికొండ విక్రమ్‌గౌడ్

కవాడిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో బీసీ విద్యార్థులకు పదివేల ర్యాంకు నిబంధన ఎత్తివేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఇందిరాపార్కు చౌరస్తాలోని బీసీభవన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే బీసీ విద్యార్థులకు ర్యాంకుల నిబద్ధత ఎత్తివేస్తామని, మిగతా ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల మాదిరిగా పూర్తి ఫీజులు చెల్లిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టారన్నారు. కాబట్టి వెంటనే ఈ పదివేల ర్యాంకుల నిబంధన ఎత్తివేసి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రం, రజక నాయకులు పాల్గొన్నారు.

'పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణపై వివక్ష తగదు'

కవాడిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గోదావరి నదిలో ఇటీవల ప్రారంభించిన సరస్వతి పుష్కరాలలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానం అందకపోవడం కులవివక్షత పాటించడమేనని మాలవారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శ్రీనివాస్ అన్నారు. బుధవారం దోమలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సొంత పార్టీ ప్రజాప్రతినిధులపై వివక్షను పాటించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయంపై మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ వంశీకృష్ణకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆపన్నులకు చేయూత ఇవ్వాలి


ఆశ్రమంలో స్నాక్స్, బిస్కెట్స్ పంపిణీ చేస్తున్న డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి

నల్లకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ఆపన్నులకు చేయూతనివ్వడంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను గుర్తెరగాలని తెలంగాణ రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి పేర్కొన్నారు. ఈ మేరకు దళిత సేన మహిళా విభాగం ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు అనాథ, దివ్యాంగుల ఆశ్రమం, ఓల్డేజ్ హోంలో ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం బన్సీలాల్‌పేటలోని హోమ్ ఫర్ ది డిసెబుల్డ్ ఆశ్రమంలోని ఆపన్నులకు స్నాక్స్ బిస్కెట్స్ ఇతరత్రా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమాబాయ్ మాలల సంక్షేమ సంఘం కోశాధికారి లక్ష్మి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తిరంగా యాత్రలు

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23వ తేదీల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తెలిపారు. బుధవారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన తిరంగాయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న సాయంత్రం 5.30 గంటలకు ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ, గోల్నాక డివిజన్లలో తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, నాయకులు ఓ.శ్రీనివాస్‌రెడ్డి, కన్నె రమేష్‌యాదవ్, ఏడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్యాచ్‌వర్క్‌ను పూర్తి చేయాలి

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో రోడ్డు ప్యాచ్‌వర్క్‌ను పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తుండడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. బుధవారం నింబోలిఅడ్డలో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ నాయకులు శ్రీకాంత్, వినోద్, నిఖిల్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, వాసు, రవియాదవ్ పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. ఎడ్ల నవీన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. మెదక్ నుంచి కాచిగూడ డెమో ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుండగా విద్యానగర్ వద్ద ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. దానిలో ల్యాప్‌టాప్‌తో పాటు డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఉన్నాయి. బుధవారం కాచిగూడ రైల్వేపీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గోపాల్, తహసీల్దార్ సంధ్యారాణి

షాదీముబారక్ చెక్కులు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న అర్హులకు షాదీ ముబారక్ చెక్కులను త్వరితగతిన ప్రభుత్వం చెల్లించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గంకు చెందిన ముస్లింలకు మంజూరైన షాదీముబారక్ చెక్కులను బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. పెండింగ్ దరఖాస్తుదారులకు వెంటనే చెక్కులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, టి.శంకర్ ముదిరాజ్, వల్లాల శ్యామ్‌యాదవ్, సాయికుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్, శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాంనగర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు పీవీఎస్.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ప్రకాష్, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఆస్రాఫ్‌కు సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, ముషీరాబాద్ సర్కిల్ సంయుక్త కార్యదర్శి ప్రసాద్, నాయకులు నర్సింగ్‌రావు, కరంవీర్‌సింగ్, అగస్టిన్, బాలేష్, ఊర్మిళ, వసంత, అనిల్, రాజయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: కార్పొరేటర్

చిక్కడపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో ప్రజాభివృద్ధిపనులు, పెండింగ్ పనులు, శానిటైజేషన్ విభాగం పనులు పూర్తిచేయాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన జోనల్ కమిషనర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై

నిర్లక్ష్యం

● ఐదేళ్లయినా పూర్తికాని పనులు ● ఆవరణంతా ప్లాస్టిక్‌స్ర్కాప్, చెక్కలు

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు ఐదేళ్లయినా పూర్తికావడం లేదు. నగర మేయర్ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించి వెంటనే నిధులు విడుదలచేసి నిర్మాణ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా.. ఒక్క అడుగు కూడా ముందడుగు పడలేదు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఇందిరానగర్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది పరిస్థితి.

2020లో శంకుస్థాపన

భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో 2020 ఫిబ్రవరి 15న 200 గజాల స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.19.10లక్షలు మంజూరు చేశారు. ఈ కమ్యూనిటీ హాల్ పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు హాజరయ్యారు. ఆనాటి నుంచి నేటి వరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు కేవలం స్లాబ్, గోడలకే పరిమితమయ్యాయి.

మేయర్ హామీ ఇచ్చినా అంతే..

నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌ను 2025 జనవరి 9న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ గౌస్‌ఉద్దీన్‌తో కలిసి సందర్శించారు. కమ్యూనిటీ హాల్ పరిస్థితిని చూసి, నిధులు వెంటనే విడుదల చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రజలకు మేయర్ హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్ర్కాప్‌కు నిలయంగా..

ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ పనులు నిలిచిపోయాయి. దీంతో స్థానిక వ్యాపారులు కమ్యూనిటీహాల్ ఆవరణలో ప్లాస్టిక్ స్ర్కాప్, ఫ్లైవుడ్ చెక్కలను నిల్వ చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు తమ వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటున్నారు. దీంతో కమ్యూనిటీ హాల్ ఆవరణ స్థలం అపరిశుభ్రంగా మారింది. వాహనదారులకు, ఈ స్ర్కాప్ నిల్వచేసే వారికి సూచించినా పట్టించుకోకుండా గొడవలకు దిగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


ఇందిరానగర్‌లో నిలిచిపోయిన కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులు

పనులు పూర్తిచేసేందుకు కృషి



ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. స్థానికులు సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేలా నిధులు విడుదల చేయిస్తాం.

- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశాం. మేయర్‌కు సైతం ఫిర్యాదు చేశాం. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరాం. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- నందగిరి నర్సింహ, స్థానిక బస్తీ నాయకుడు

స్ర్కాప్, వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా..



కమ్యూనిటీ ఆవరణ స్థలం చెత్తకుప్పలు, ప్లాస్టిక్ స్ర్కాప్ నిల్వలకు అడ్డాగా మారింది. పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- బిజ్జి కనకేష్‌కుమార్, స్థానికుడు


ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ (ఫైల్)


కమ్యూనిటీహాల్ ఆవరణలో కుప్పలుగా ప్లాస్టిక్‌స్ర్కాబ్, చెక్క ముక్కలు

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అసంఘటిత రంగ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ చెన్నయ్య

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని అసంఘటిత రంగ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ చెన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎన్జీవో, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక రంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంఘిక భద్రత, 2020 చట్టం రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి, కార్మిక చట్టాలను వర్తింపచేయాలన్నారు. కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక కోడ్‌ను రద్దు చేయాలని, స్త్రీ, పురుషులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని, కార్మిక మహిళల ప్రసూతికి రూ.50 వేల ఆర్థిక సహకారం అందించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద స్థలంలో సంఘటనపై అంగవైకల్యం, మృతి చెందిన వారికి 5 లక్షల ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు, సంక్షేమం పథకాలపై గ్రామీణ ప్రాంతాలలో కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసీఎస్.ప్రసాద్, వెంకటయ్య, ప్రఫుల్ రాంరెడ్డి, ప్రసాద్, అవినాష్, ఇందిరా, ఆస్రా, అమృత, రేణుక, నారాయణస్వామి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయి హోల్కర్ సేవలు ఆదర్శం

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధి కోసం అహల్యాబాయి హోల్కర్ చేసిన సేవలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవి సూచించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అహల్యాబాయి హోల్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమత, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకురాలు అనంతలక్ష్మి, సుభాషిణి, జ్యోతి, రజనీ, నీరజ, కిలారీ మనోహర్ పాల్గొన్నారు.

'17 బీసీ కులాలను ఎంబీసీలుగా గుర్తించాలి'

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా, ఆర్థికంగా వెనుకబడిన 17 బీసీ కులాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంబీసీలుగా గుర్తించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు ధర్మారావు డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో 17 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు కమ్మరి మోహన్‌చౌహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రాష్ట్రంలో 17 బీసీ కులాలు అత్యంతఆర్థికంగా వెనుకబడి ఉన్నాయన్నారు. వాటిని ఎంబీసీ జాబితాలో చేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాంప్రసాద్, బాబు, జాజేరావు, వేదకర్, భాస్కరుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.


బురదమయంగా రాజాడీలక్స్ చౌరస్తా ప్రాంతం

ముషీరాబాద్‌లో కురిసిన వర్షం

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు కురిసిన వర్షానికి పద్మశాలీకాలనీలోని 1-4-27/72/30 ఇంటి ముందు గల చెట్టు వర్షం తాకిడికి పూర్తిగా వంగిపోయి విద్యుత్ తీగలపై ఆగింది. వృక్షం ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాయారం మార్కెట్ నుంచి రాజా డీలక్స్ చౌరస్తా వరకు రోడ్డంతా బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ అనంతరం రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్శిగుట్ట, బాపూజీనగర్, వినోబానగర్‌లో వర్షంనీరు పెద్దఎత్తున రోడ్లపై ప్రవహించాయి. దీనితో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఆక్సిజన్ పార్కు సందర్శన వేళలను పొడిగించాలి

డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): డీడీకాలనీ పక్కన గల ఓయూకు చెందిన స్థలంలో ఆక్సిజన్‌పార్కుకు వచ్చే వాకర్స్‌కు అనుకూలంగా పార్కును తెరచి ఉంచాలన్నారు. ఈ మేరకు ఓయూ వీసీ ఎం.కుమార్‌కు డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్సిజన్ పార్కును ఉదయం 6 నుంచి 10 గంటల వరకు తెరచి ఉంచుతున్నారని 11 గంటల వరకు పొడిగించాలన్నారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు వాకర్స్‌కు అవకాశం కల్పించాలని కోరారు. తమ వినతిపై ఓయూవీసీ స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ హరిచరణ్, రఘువీరారెడ్డి, రాంరెడ్డి, రవీందర్, లక్ష్మణ్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కంప్యూటర్ యుగంలోకి తీసుకెళ్లిన ఘనత రాజీవ్‌దే



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ

చిక్కడపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కంప్యూటర్ యుగంలోకి తీసుకెళ్లిన ఘనత రాజీవ్‌గాంధీదేనని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీని స్ఫూర్తిగా తీసుకుని యువత దేశప్రగతిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, కాంగ్రెస్ నాయకులు వీడీ.కృష్ణ, అంజియాదవ్, శీలం సత్యనారాయణ, గుండు జగదీశ్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, అనిల్‌యాదవ్, మధుమతి, కేఆర్‌కే.ప్రసాద్, బంటారం యాదగిరిగౌడ్, విజయ్, నాగభూషణం, శ్రీకాంత్‌గౌడ్, మజార్, హఫీజ్, తిరుమలరావు, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

యువ రాజకీయానికి నవ మార్గదర్శి రాజీవ్‌గాంధీ


నర్సింహాబస్తీలో నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు

నల్లకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): యువ రాజకీయానికి నవమార్గదర్శి, ఆధునిక భారత నిర్మాత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నర్సింహాబస్తీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీహెచ్.మురళీకృష్ణ, కె.మధు, బి.శ్రావణ్, పి.రాజు, కుమార్, రాజు, కిషోర్, నానీ, సాయిరామ్, ప్రవీణ్ పాల్గొన్నారు.


బాగ్‌లింగంపల్లిలో ఆపరేషన్ మస్కిటోస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి

బాగ్‌లింగంపల్లిలో ఆపరేషన్ మస్కిటోస్

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఆపరేషన్ మస్కిటోస్ కార్యక్రమం ద్వారా రాంనగర్‌లో దోమల నివారణకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ కె.రవిచారి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ సూపర్‌వైజర్ అజయ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ మస్కిటోస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని రవిచారి ప్రారంభించి మాట్లాడారు. వర్షా కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా, ప్రజలకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండుకు ఈ కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ చేపట్టిందన్నారు. మూడు టేబుల్ ఫాగింగ్ మిషన్లు, నాలుగు భారీ వాహనాల ఫాగింగ్ మిషన్లు ఏర్పాటు చేసిందన్నారు. డివిజన్‌లోని అన్ని బస్తీలు, కాలనీలో దోమల నివారణకు పిచికారి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బీజేపీ నాయకులు ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో రోడ్ల ఆధునికీకరణకు కృషి


అంజుమన్ వీధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో అధ్వానస్థితికి చేరుకున్న రోడ్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పరుస్తున్నామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీసభ్యుడు గౌస్‌ఉద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని అంజుమన్ వీధిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గౌస్ ఉద్దీన్ మాట్లాడుతూ... రూ. కోటి 50లక్షలతో భోలక్‌పూర్‌లో రోడ్లను పునర్‌నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షరీఫ్, ఆజీపాషా, అక్లాక్ హుస్సేన్, జీహెచ్‌ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీయాలి


పిల్లలకు జ్ఞాపికను అందజేస్తున్న కేజీయా రీచట్స్

ముషీరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి, ఆయా రంగాల్లో వారు మరింత ప్రావీణ్యం సాధించేలా కృషి చేయాలని ప్రార్థనవీరుల చర్చి వ్యవస్థాపకుడు, పాస్టర్ మరిదాస్ అన్నారు. బుధవారం రాంనగర్‌లోని ప్రార్థనవీరుల చర్చిలో నిర్వహించిన వీబీఎస్ ముగింపు కార్యక్రమానికి మరిదాస్, సూపరింటెండెంట్ కేజీయా రీచట్స్ హాజరై చిన్నారులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీబీఎస్ డైరెక్టర్‌లు ఎం.ఎస్రా, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్‌కు నోటీసులు

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీష్‌రావుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ ఆరోపించారు. బుధవారం రాంనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకే కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. కేసీఆర్‌కు నోటీసు ఇచ్చి తెలంగాణ ప్రజలను అవమానించారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి బెదిరింపులకు కేసీఆర్, హరీష్‌రావు బెదరరు అని అన్నారు.